క్లుప్తంగా

ఎళ్లవేళలా అండగా ఉంటా



గాయపడిన కార్యకర్తను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : మండలంలోని ఒడ్డుపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త సుబ్రమణ్యం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలిసి మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, తాను ఎళ్లవేళలా తోడుగా ఉంటామని భరోసా కల్పించారు. మెరుగైన చికిత్స నిమిత్తం సుబ్రమణ్యం కుటుంబ సభ్యులకు రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గురవారెడ్డి, సర్పంచ్ మార్కొండయ్య, నాయకులు డిసెంబర్‌శెట్టి, కాలప్ప, మణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం ఎస్‌ఐగా సుమన్



శ్రీరంగరాజపురం : మండల నూతన ఎస్‌ఐగా సుమన్ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల శాంతి భద్రతలకు కృషి చేస్తానన్నారు. అక్రమ కలప, బియ్యం, ఇసుక రవాణా, సారా స్థావరాలపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటా అన్నారు. రాత్రివేళ కూడా గస్తీ నిర్వహించి, నేరాల నియంత్రణకు కృషి చేస్తానని తెలిపారు.

చట్టాలను అతిక్రమిస్తే శిక్షార్హులే

నగరి: చట్టాలను అతిక్రమిస్తే శిక్షార్హులవుతారని సీఐ మహేశ్వర్ హెచ్చరించారు. శుక్రవారం పీసీఎన్ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆయన సైబర్ క్రైమ్, హెల్మెట్ ధారణ, డ్రగ్స్ అడిక్షన్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, హెల్మెట్ ధరించకుండా మోటార్ సైకిళ్లలో వేగంగా వెళ్తూ ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్న వారిలో యువతే ఎక్కువగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. మితిమీరిన వేగం, హెల్మెట్ ధరించకపోవడం కొన్ని సందర్భాల్లో భారీ మూల్యం చెల్లించక తప్పదని విద్యార్థులు గుర్తెరగాలని హితవు పలికారు.

బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓలు

పుత్తూరు: పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఎంఈఓలు బహుమతులు అందజేశారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను పి.రుగ్మాష్ (533), కె.దినేష్ (486), ఎస్.మోహన్ (484) మార్కులు సాధించి పాఠశాలలో తొలి మూడు స్థానాల్లో నిలిచారని ఎంఈఓ తిరుమలరాజు తెలిపారు. వీరికి నగదుతో పాటు జ్ఞాపికలు, మెడల్స్ ను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 బాలసుబ్రమణ్యం, ప్రిన్సిపల్ ఎం.శేషగిరి, స్కూల్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృష్ణయ్య మరణం తీరని లోటు



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పార్టీ నాయకులు

నగరి: మండలంలోని ముడిపల్లె ఎంపీటీసీ సులోచనమ్మ భర్త కృష్ణయ్య మృతి పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు రాంప్రసాద్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి కృష్ణయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అంత్యక్రియలకు రూ.15,000 అందజేశారు.

ప్రైవేటు క్లినిక్స్ తనిఖీ

నగరి: గుర్తింపు, రిజిస్ట్రేషన్ లేని క్లినిక్స్‌పై చర్యలు తప్పవని డీఐవో డాక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. శుక్రవారం నగరి మున్సిపల్ పరిధిలోని పీఎంపీ, ఆర్‌ఎంపీల క్లినిక్స్‌ను ఆయన తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్లు ఉన్నాయా, లేవా అని పరిశీలించారు. కొందరు రికార్డులు అప్‌డేట్ చేసుకోలేదని గుర్తించి వారిని హెచ్చరించారు. మరోసారి తనిఖీ నాటికి తీరు మారకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలో యూపీహెచ్‌సీ వైద్యులు ఎయిల్ అరసన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇస్రో విజయాలు గర్వకారణం



ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

కార్వేటినగరం: మానవుడిలో జ్ఞానం, సృజనాత్మకతకు పరిమితులు లేవని డీఎంపురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేశవులు అన్నారు. శుక్రవారం భారత మొదటి అంతరిక్ష దినోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అంతరిక్ష పరిశోధనలో శాస్త్ర సాంకేతిక పాత్ర, భారత విజయాలను విద్యార్థులకు కళ్లకు కట్టినట్లు వివరించారు. అదేవిధంగా జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో కూడా ఛాత్రోపాధ్యాయులు వివిధ రకాల నమూనాలు తయారు చేసి అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు, పలువురు పాల్గొన్నారు.

కఠినమైన చట్టాలు తేవాలి



కోల్‌కతా ఘటన మమ్మలందరినీ కలచివేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే వైద్యులకు భద్రత పెంచడమే కాకుండా కఠినమైన చట్టాలు రావాలి. రాత్రిపూట అదనపు భద్రత కల్పించాలి.

– సుమలత, పీహెచ్‌సీ, నింద్ర

సెక్యూరిటీ పెంచాలి



విజయపురం మండలం మారుమూల ప్రాంతం పీహెచ్‌సీ. ఇది 24 గంటలు పనిచేసే ఆస్పత్రి. ఈ ఆస్పత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది మొత్తం 64 మంది మహిళలు ఉన్నారు. రాత్రిపూట మద్యం సేవించి ఆస్పత్రికి వచ్చేవారున్నారు. మహిళల భద్రత నిమిత్తం ఒక సెక్యూరిటీని, ఒక కానిస్టేబుల్‌ను నియమించాల్సిన అవసరం ఉంది.

– విష్ణుప్రియ, డాక్టర్, విజయపురం పీహెచ్‌సీ

సౌకర్యాలు కల్పించాం



ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించాం. వైద్యులకు వాష్ రూమ్స్, విశ్రాంత గదులు ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు. అదనపు సెక్యూరిటీ అవసరం. పోలీసు ఔట్ పోస్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ప్రభావతి, మెడికల్ సూపరింటెండెంట్, నగరి

ప్రాణాలు కాపాడే వైద్యులకే ఆస్పత్రుల్లో భద్రత, రక్షణ ప్రశ్నార్థకమవుతోందని కోల్‌కతా ఉదంతం దేశాన్ని ఓ కుదుపు కుదిపింది. వైద్యులు, వైద్య విద్యార్థులు, ప్రజలు ఆందోళన బాట పట్టడంతో సుప్రీంకోర్టు స్పందించింది. ఆస్పత్రుల్లోని భద్రతా చర్యలను ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో నగరి నియోజకవర్గంలోని ఆస్పత్రులను పరిశీలించినప్పుడు పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి. ఉద్యోగులు కూడా సమస్యలు ప్రస్తావించారు.



మరింత భద్రత అవసరం

- ఇప్పటికే రూ.5కోట్లతో ఏరియా ఆస్పత్రి ఆధునికీకరణ
- పూర్తికావలసి ఉన్న వెయిటింగ్ హాలు, క్యాంటీన్
- పోలీస్ ఔట్ పోస్ట్, అదనపు సెక్యూరిటీ అవసరం

నగరి : నగరి నియోజకవర్గంలో 2.66 లక్షల జనాభా ఉండగా వీరికి వైద్యసేవలు అందించడానికి ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటర్, 4 అర్బన్ హెల్త్ సెంటర్లు, 7 ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. 41 మంది వైద్యులు, 476 మంది వైద్య సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో నగరి, నింద్ర, విజయపురం మండలాల్లో మహిళా వైద్యులు, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు 217 మంది పనిచేస్తున్నారు. నగరి ఏరియా ఆస్పత్రి పట్టణానికి దూరంగా ఉంది. ఆస్పత్రి చుట్టూ ఎక్కువ దూరం వరకు నివాసాలు లేవు. ఏరియా ఆస్పత్రికి ఔట్ పోస్ట్ ఏర్పాటు చేసి పోలీసులను నియమించాల్సిన అవసరం ఉంది. ఆస్పత్రికి సెక్యూరిటీ సిబ్బంది కూడా తగినంత లేరు. ఆర్చి నుంచి ఆస్పత్రి వరకు లైట్లు ఉన్నా ప్రధాన రహదారిలో కొంత దూరం వరకు లైట్లు లేకపోవడంతో నైట్ డ్యూటీకి వచ్చే వైద్యులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళా సిబ్బంది విషయంలో భద్రత కల్పించాల్సిన ఉంది.

ఆస్పత్రి	మహిళా వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు
నగరి ఏరియా ఆస్పత్రి	108
విజయపురం పీహెచ్‌సీ	64
నింద్ర పీహెచ్‌సీ	45

- మారుమూల ప్రాంతమైన విజయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చేరుకోవాలన్నా కష్టతర మే. బుగ్గ అగ్రహారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన రహదారి నుంచి పొలాలు ఉన్న మార్గంలో దూరంగా ఉంటోంది. ఇక్కడ ఉద్యోగులు ఇబ్బందుల నడుమ విధులు నిర్వర్తిస్తున్నారు.

నియోజకవర్గంలో వైద్య సేవలు

జనాభా	:	2.66 లక్షలు
ఏరియా ఆస్పత్రి	:	1
కమ్యూనిటీ హెల్త్ సెంటర్	:	1
అర్బన్ హెల్త్ సెంటర్లు	:	4
ప్రైమరీ హెల్త్ సెంటర్లు	:	7
వెల్‌నెస్ సెంటర్లు	:	48
వైద్యులు	:	41 మంది
వైద్య సిబ్బంది	:	476 మంది

రాత్రి పూట సెక్యూరిటీ పెంచాలి



వైద్యులకు ప్రత్యేకమైన రక్షణ చట్టాలు తీసుకురావాలి. ఏరియా ఆస్పత్రిలో రాత్రిపూట సెక్యూరిటీ పెంచాలి. రాత్రుళ్లు పేషెంట్లను ఆస్పత్రికి తీసుకువచ్చేవారు సిబ్బందితో గొడవలకు దిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. అలాంటి సందర్భాల్లో వైద్యులపై దాడులకు దిగినా దిక్కులేదు. వీటికి చెక్ పెట్టాలంటే పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయాలి. ఆర్చికి అవతలవైపు కూడా లైట్లు వేయాలి.

– రాజరత్నమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్, నగరి ఏరియా ఆస్పత్రి

ఘనంగా అంతరిక్ష దినోత్సవం



రాకెట్ నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నగరి : నగరి మున్సిపాలిటీ పుదుపేట ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రాకెట్ నమూనాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు వక్తృత్వ , చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశామని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసన్ తెలిపారు.

గ్రామసభల్లో టీడీపీ నాయకుల ఓవరాక్షన్

పాలసముద్రం : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు గుర్తించేందుకు అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు డీపీఓ లక్ష్మి తెలిపారు. శుక్రవారం కృష్ణజమ్మపురంలో ఏఓ విద్యావతి, ఏపీఓ మార్గరేట్ ఆధ్వర్యంలో ఉపాధి గ్రామసభలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీపీఓ మాట్లాడారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు పార్టీల కు అతీతంగా పని చేయాలని కోరారు. 2024–25 ఆర్థి క సంవత్సరంలో పనులు గుర్తించడానికే గ్రామసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి ప్రణాళికల తయారీ చేయాలని సూచించారు. చెత్త నుంచి సంపద తయారీపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అయితే మండలవ్యాప్తంగా జరిగిన ఈ గ్రామ సభల్లో టీడీపీ నాయకులు ఓవరాక్షన్ చేశారు. తాము చెప్పినట్లు ఉపాధిహామీ సిబ్బంది పనులు చేయించాలని, లేదంటే ఫీల్డ్‌అసిస్టెంట్లను తొలగిస్తామని బెదిరించడంతో మండలంలో ఇప్పటికే కూలీల శాతం సగానికి పడిపోయింది. ఉన్నతాధికారులు స్పందించి టీడీపీ నాయకులను నియంత్రించాలని పలువురు ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారు. మండల విస్తరణాధికారి రమేష్, ఏఓ ఢిల్లీప్రసాద్, సర్పంచ్ భానుప్రియ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలకు పరామర్శ



ఈశ్వరరెడ్డికి చిత్రపటం బహూకరిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: మండలంలోని పలువురు నాయకులు, కార్యకర్తలను మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పరామర్శించారు. శుక్రవారం ఆయన పచ్చికాపల్లంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈశ్వరరెడ్డి గృహ ప్రవేశ వేడుకల్లో పాల్గొన్నారు. శుక్రవారం మండలంలోని పచ్చికాపల్లంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాజీమంత్రిని వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నేతలు, కార్యకర్తలను విడివిడిగా పలకరించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీడీఎం పురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఆనందరెడ్డిని పరామర్శించారు. ఇటీవల ఆనందరెడ్డికి కాలికి గాయాలవడంతో ఆరోగ్యంపై వాకబు చేశారు. మెరుగైన చికిత్స తీసుకోవాలన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు రామయ్య, యువత మాజీ మండల అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, సాంస్కృతిక విభాగం మండల అధ్యక్షుడు రవికుమార్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, సచివాలయ కన్వీనర్ జగదీశ్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొత్తపల్లె రోశయ్య, నాయకులు ఆనందరెడ్డి, వెంకటమున్ని, మురళీ, దామోదరరెడ్డి, భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జయరామయ్య, ఎంపీటీసీ భర్త విజయ భాస్కర్, నాగరాజరెడ్డి, రాజవేలు, చెంగల్రాయులు ఉన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

నగరి: టీఆర్ కండ్రిగ షాదీమహల్ సమీపంలోని ప్రభుత్వం స్థలంలో ఆ ఆక్రమణలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, పోలీసులు తొలగించారు. పదిరోజుల క్రితం కొందరు పాకలు వేసి ఇక్కడ స్థలాలను ఆక్రమించారు. శుక్రవారం ఉదయం తహసీల్దార్ రవి కుమార్, సీఐ మహేశ్వర్, మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్ ఆ పాకలను తొలగించి స్థలాన్ని శుభ్రం చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు, కాలువ పోరంబోకులను ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉద్వేగాలు ప్రగతికి ప్రతిబంధకాలు



వ్యక్తిత్వ వికాసంపై ప్రసంగిస్తున్న డాక్టర్ సుధాకర్‌రెడ్డి

పుత్తూరు: యుక్త వయస్సులో ప్రతికూల ఉద్వేగాలు ప్రగతికి ప్రతిబంధకాలుగా మారుతాయని, వాటిని నియంత్రించుకుంటే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్‌బి సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వ్యక్తిత్వ నిర్మాణం–లక్ష్యసాధన అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, విపరీత ధోరణి, మితిమీరిన ఉద్వేగాలు కొందరిని తప్పుదారి పట్టిస్తాయని వివరించారు. ఫలితంగా మాదకద్రవ్యాల సేవనం, ఇతర వ్యసనాలకు బానిసలను చేస్తుందన్నారు. ఇలాంటి పరిస్థితికి ఏ విద్యార్థి గురికారాదని,, ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.గోపాల్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలువల్లో వ్యర్థాలు, పూడిక తొలగింపు



కాలువల శుభ్రం పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

నగరి: సత్రవాడ నుంచి మాంగాడు చెరువు వరకు ఉన్న సప్లయ్ చానళ్లలో పేరుకుపోయిన రసాయన వ్యర్థాలు, పిచ్చిమొక్కలు, పూడిక తొలగింపు పనులను మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం శుక్రవారం ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ మాట్లాడుతూ సత్రవాడ, కరకంతాపురం , ఉయ్యాలకాలువ వద్ద మూడు హిటాచీలతో పనులకు పూనుకున్నట్లు చెప్పారు. సుమారు 20 లక్షలతో ఈ పనులు పూర్తిచేస్తామన్నారు. గతంలో డైయింగ్ యూనిట్ల నుంచి వచ్చే వ్యర్థ నీరు ఈ కాలువల్లో ప్రవహించేదని, ఇకపై కాలువల్లోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డీఈ నరేష్, ఏఈ రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం పాల్గొన్నారు.

‘ఉపాధి’ సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్

కార్వేటినగరం: కేంద్రప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధిహామీ పనులను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ అన్నారు. శుక్రవారం కొల్లాగుంటలో ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ గ్రామసభలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. వ్యవసాయంలో కూలీల కొరతను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడం జరిగిందన్నారు. అలాగే ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా ప్రతి కుటుంబానికి 100 రోజులు పనులు కల్పించి ఆర్థికంగా ఎదగడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ లబ్ధిదారులకు 150 రోజులు ఉపాధి ఉంటుందన్నారు. అలాగే ఉపాధిహామీ ద్వారా కొత్త ఫీడర్ కాలువ తవ్వకాలు, గట్లపై మొక్కల పెంపకం, రైతులకు సౌకర్యంగా నీటి వనరులు కల్పించడానికి ఫారంపాండ్ నిర్మాణాలు చేసుకోవచ్చన్నారు. పండ్లతోటల్లో భూసార సంరక్షణకు కందకాలు తవ్వడం, రైతుల భూముల్లో గడ్డి పెంపకం, పశువుల షెడ్లు, కోళ్లఫారాలు, పట్టు పురుగుల షెడ్ల నిర్మాణాలు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందన్నారు. అలాగే మేజర్ పంచాయతీ కార్వేటి నగరంలో సర్పంచ్ ధనంజయవర్మ, ఆర్కేవీబీపేట సర్పంచ్ దివ్య ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లక్ష్మీపతి, ఉప సర్పంచ్‌లు శాంతి, పవన్‌కుమార్, నాగేశ్వరరాజు, చెంగల్‌రాయ యాదవ్, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికే గ్రామసభలు



గ్రామ సభలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ గ్లోరి



వెదురుకుప్పం: మాట్లాడుతున్న సర్పంచ్ శిల్ప



నగరి: మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు గాంధీ

–జెడ్పీ సీఈఓ గ్లోరి

నింద్ర: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసమే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు జెడ్పీ సీఈఓ గ్లోరి అన్నారు. మండలంలోని చవరంబాకంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. గ్రామ పంచాయతీలో చేయవలసిన వివిధ అభివృద్ధి పనులను గ్రామసభలో చర్చించి ఆమోదం పొందాలన్నారు. గ్రామంలో సిమెంట్ రోడ్డు, నాగలాపురం రోడ్డు వరకు తారు రోడ్డు, విద్యుత్ తీగలు మరమ్మతులు..ఇత్యాది సమస్యలను సర్పంచ్ మనోహర్ నాయుడు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అలాగే మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లోనూ సమస్యలను అధికారులకు ప్రజలు నివేదించారు. కార్యక్రమంలో డీపీఓ లక్ష్మి, ఎంపీడీఓ అరుణ, మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం : ఉపాధి నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. ముద్దుకుప్పంలో నిర్వహించిన గ్రామసభలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. గతంలో ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని అర్హులకు పంపిణీ చేసే బాధ్యత తనదని అన్నారు. సర్పంచ్ గిరిబాబు, ఎంపీడీఓ మోహన్‌మురళి, తహసీల్దార్ అమర్‌నాథ్, టీడీపీ మండల అధ్యక్షుడు జయశంకర్‌నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టేందుకే..

గంగాధర్ నెల్లూరు: మండలంలోని 32 పంచాయతీలలో ఉపాధి పనులు చేపట్టేందుకు ప్రత్యేకంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు డ్వామా పీడీ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్ద కాలువ పంచాయతీలో సర్పంచ్ ఏకాంబరం అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. మండల ప్రత్యేకాధికారి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్ హాజరయ్యారు. అలాగే జీడీ నెల్లూరు సచివాలయంలో సర్పంచ్ వీసీ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన గ్రామ సభకు మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాఘవేంద్ర రాజు మాట్లాడారు.

నగరి మండలంలో..

నగరి : మండలంలోని పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు గుర్తించడానికి శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కడెక్కడ ఉపాధి హామీ పనులు చేసుకోవచ్చో గ్రామస్తులకు అధికారులు వివరించారు. తడుకుపేట గ్రామసభలో జెడ్పీటీసీ గాంధీ అధ్యక్షత వహించి మాట్లాడారు. శుభ్రం చేయాల్సిన నీటి పారుదల కాలువలు, మురుగునీటి కాలువల వివరాలను అధికారులకు నివేదించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ గ్లోరి, డీపీఓ లక్ష్మి, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ లీలామాధవి, వైస్ ఎంపీపీ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

విజయపురంలో..

విజయపురం: స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌జీఎస్ గ్రామసభ నిర్వహించారు. అలాగే ఆయా పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద చేయవలసిన పనుల గురించి చర్చించి ఆమోదం పొందారు. ఆలపాకం గ్రామసభలో జెడ్పీ సీఈఓ గ్లోరి, డీపీఓ లక్ష్మి పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ వంద రోజులు పనులు కల్పించాలన్నదే గ్రామ సభల లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రమౌళి, ఏఎంఎం బబిత, ఈఓపీఆర్‌డీ సురేంద్రకుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరిస్తాం

వెదురుకుప్పం: గ్రామాల్లో అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని వెదురుకుప్పం సర్పంచ్ శిల్ప అన్నారు. శుక్రవారం మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. వెదురుకుప్పంలో సర్పంచ్ శిల్ప మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా ప్రజలకు సేవ చేసేందుకు, వారి సమస్యలను పరిష్కరించేందుకు ముందుంటామన్నారు. సర్పంచుల సంఘం మండల అధ్యక్షురాలు భారతి, సర్పంచ్‌లు పుష్ప, గోవిందయ్య, కుమారి, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పని చేయండి



హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిత

- మండల సమావేశంలో ఎంపీపీ అనిత
- ఆర్‌అండ్‌బీ, అటవీ శాఖ అధికారులు గైర్హాజరు

గంగాధర నెల్లూరు: మండలంలో అభివృద్ధే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు అంతా కలిసి పని చేయాలని, అక్కడక్కడా వెలుగు చూస్తున్న చిన్నచిన్న సమస్యలను కూడా వెంటనే పరిష్కరించి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ అనిత కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలువురు సభ్యులు సమస్యలపై ధ్వజమెత్తారు. గంగాధర నెల్లూరు నీవానది వంతెనపై ఒకవైపు గోడ పడిపోయిందని పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, అలాగే నెల్లేపల్లి బొబ్బిగానిపల్లి మధ్యలో గత మూడు నెలల్లో పది మందికి పైగా ప్రమాదాల్లో మరణించారని, ఇది తెలిసి కూడా ఆర్‌అండ్‌బీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. వెజ్జుపల్లె సర్పంచ్ హరిప్రసాద్ మాట్లాడుతూ, విద్యుత్ లైన్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ప్రస్తావిస్తున్న సమస్యలపై అధికారులు రాత పూర్వకంగా వివరణ ఇవ్వడం లేదని ప్రజాప్రతినిధులు నిరసించారు.. వెటర్నరీ డాక్టర్ నాగాంజనేయులు మాట్లాడుతూ, పాడిఆవులకు లంపి స్కిన్ వ్యాధి రాకుండా ముందస్తుగా ఇంజెక్షన్లు వేశామని, పాడి ఆవులకు బీమా సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాఘవేంద్రరాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సర్పంచులు, ఎంపీటీసీలు తెలిపిన వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి హాజరు కానిఅధికారులపై జిల్లా కలెక్టర్‌కు నివేదికలు పంపించాలని ఎంపీపీ అనితతో పాటు పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీప్రియ, వైస్ ఎంపీపీలు హరిబాబు, బేబి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఏఎస్‌డబ్ల్యూఓ షకీలా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బిందుమాలతి, ఉపాధి హామీ ఏపీఓ శ్రీనివాసులు, ఎంఈఓ ఆంజనేయులు శెట్టి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ దాము, వ్యవసాయ అధికారిణి భవాని, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ గీత తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జడ్జీలు రాఘవేంద్ర, జానకి

పుత్తూరు: స్థానిక సబ్ కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి. రాఘవేంద్ర కోరారు. శుక్రవారం కోర్టులో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ, లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారానికి న్యాయవాదులు కృషి చేయాలని కోరారు. ప్రధానంగా రాజీ కాదగిన క్రిమినల్ కేసులతోపాటు అన్ని రకాల సివిల్ కేసులను రాజీ చేయాలని సూచించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సి.జానకి మాట్లాడుతూ, కాలం, సొమ్ము వృథా కాకుండా ఉండేందుకు రాజీ మార్గమే సురక్షితమైనదని కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.పురుషోత్తం, సెక్రటరీ మురళి, న్యాయవాదులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ మహాకుంభాభిషేకం





మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు, పురవీధుల్లో దర్శనమిస్తున్న అమ్మవారు

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురం చెరువుకట్ట కింద నూతనంగా నిర్మించిన సంజీవమ్మ అమ్మవారి ఆలయంలో మహాకుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం వేదపండితులు ఆలయంలో గణపతి హోమం, నవగ్రహ హోమం, వివిధ యాగశాల పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి గోపూజ, మహా పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. అలాగే యాగశాలలో రెండు రోజులుగా నిర్వహించిన పూజల అనంతరం ఆ కలశాలలోని పవిత్ర జలాలను వేదపండితులు మంగళవాయిద్యాలతో తీసుకొచ్చి అమ్మవారి ఆలయంపైన ఉన్న కలశాలకు మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పవిత్ర జలాల కోసం భక్తులు ఎగబడ్డారు. మధ్యాహ్నం అమ్మవారిని సింగిల్‌విండో మాజీ అధ్యక్షురాలు గాలిజ్యోతి ఆలయానికి తాళిబొట్టు, పూజాసామగ్రిని ఊరేగింపుగా తెచ్చి అమ్మవారికి సమర్పించారు. ఉభయదారులు తీసుకొచ్చిన వివిధ పుష్పాలతో అమ్మవారిని సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం పుష్పపల్లకిలో అమ్మవారిని కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు.